కథానిక

# మర్యాదస్తులు

"సులోచన"

తెల్లవారుతూ వుంది. కాంతమ్మ కుడితికుండ భుజాన పెట్టుకొని పండగజాల దూరంలో వున్న చావిట్లోకి వెళ్ళింది. కాంతమ్మని చూడటంతోటే పాడిగేదె తాడు తెంచుకొనేందుకు లాగులాడటం ఆరంభించింది. కుడితి త్రాగేందుకు. కాంతమ్మ మెల్లగా కుడితికుండ దింపుకొని కుడితి తొట్లో పోసింది.

ఇంతలో పెరుగు రావమ్మ దొడ్లో కొచ్చింది. "కాంతమ్మగారూ! త్వరగా రండి. పెరుగు వేద్దురుగాని, నాకసలే రైలువేళ అవుతూంది." అని కాంతమ్మని త్వరపెట్టింది.

కాంతమ్మ కుడితికుండని చేతిలో పట్టుకొని యింటికి వొచ్చింది. ఆమె రోజులాగే గేదెని చూడలేదు. బహుశా తను రావమ్మకి పెరుగు వేసివొచ్చి తరువాత గేదెను కుడితికి విప్పుదాము అని అనుకొని వుండొచ్చు కాంతమ్మ. ఇంటికి వెళ్ళే త్రోవలో అత్త కృష్ణవేణమ్మ దొడ్లోకి పోతున్నట్టు కనపడింది కాంతమ్మకు.

ఇంతే —

వ్యవధి లేదు. కాంతమ్మ రావమ్మకి ముప్పావలా పెరుగు వేసి, అంటుకుండలు తూములో వేసి, ఇంకో పొయ్యిలో బూడిద వున్నా యెత్తలేదు. గేదెను విప్పేసేందుకు చావిట్లోకి వెళ్ళింది. వెళ్ళే త్రోవలో వెళ్ళి అత్త యింటికి వొస్తూన్నట్టు కనబడింది.

కాంతమ్మ సత్వరం చావిట్లోకి వెళ్ళి గేదె తాడువిప్పి కుడితి తొట్టిదగ్గరకు తీసుకొచ్చింది గేదెను. ఏముంది? అపచారం జరిగిపోయింది. కుడితితొట్లో చారెడు నీళ్ళు లేవు. కాంతమ్మ శరీరం కోపంతో అదిరింది. గేదెను యథాస్థానంలో కట్టివేసి చరచరా చావిడి ప్రక్కభాగంలో కట్టివేసివున్న అత్తయ్య గేదె దగ్గరకు వెళ్ళింది కాంతమ్మ. ఆ గేదెకు మూతి నిండా చిట్టు, తవుడు మరకలు వుండటమే కాకుండా యింకా అది తడి ఆరని తవుడు నీళ్ళను నాలుక చాపి ముట్టెను నాకుకుంటున్నది.

"ఇదంతా అత్తయ్యగారి పని. తను పోసి వెళ్ళిన కుడితినీళ్ళను, సిగ్గులేకుండా గేదెకు పెట్టుకొంది. ఇంతలోనే దొంగతనమా?" అనుకొంది కాంతమ్మ. తన అత్తయ్యేగదా, ఏదో తప్పుపని చేసిందిలే అనుకొని వూరుకొంటే బాగుండేది. కాని కాంతమ్మ అటువంటిది కాదు. కొడుకుతో పాటు తండ్రి భాగం పంచుకోనిచ్చి ఆస్తినంతా కూతురుకు తోస్తున్నదన్న ద్వేషం ఆమెలో యెన్నోరోజులుగా వుంది.

చరచరా గొడ్లలోంచి వొచ్చింది. ఇంటి ముందు కళ్ళాపి చల్లుతూన్న పొరుగావిడ నాంచారమ్మ దగ్గరకొచ్చి ఆరంభించింది కాంతమ్మ.

"మనిషై పుట్టినంతరువాత బుద్ధి వుండాలి. మనిషిజన్మమెత్తింది లెక్కగాదు. నీతి వుండాలి."

"ఎవరిమీదనే కాంతమ్మా ప్రొద్దుకొన్ని మొదలెట్టావు!" అన్నది నాంచారమ్మ, కళ్ళాపు చిప్ప చేతిలో పట్టుకొని.

"ఎవర్నో పరాకెక్కి పగవాళ్ళను. నేనేం పిచ్చిదాన్నా, చెడిపోయిన దాన్నా? చూడు నాంచారమ్మొదినా! ఆ ముసలిముండకి బుద్ధి వున్నదా? అసలు సిగ్గు అన్నదైనా లేదు. యాభై యేళ్ళు వొచ్చినయ్యిగాని బుద్ధిరాదుగదా!..."

"ఏమిటీ? యేంచేసింది?" ఆత్రంగా అడిగింది, నాంచారమ్మ. తను ముందుగా ఆ విశేషం తెలుసుకొని ప్రక్కయింటావిడతో చెప్పాలనే ఆతురతతో.

"ఇంకేముంది. మా అత్తముండ దొంగబుద్ధి. తెల్లవారగట్ల మా వంటింట్లో కుడితికుండ యెత్తిపెట్టి గేదెను విడదామనుకుంటూండగానే పెరుగు రావమ్మ కేకేసింది. దానికి బండి వేళ అవుతూందిగదా అని కుడితికి విడువకుండానే ఇంట్లోకి వెళ్ళాను. ఇంతలో మా అత్తవచ్చి తన గేదెను ఆ కుడితికి విడిచి

మళ్ళా నేను వచ్చేలోపల గేదెను తన చావిట్లో కట్టేసి పాలకు వారొచ్చింది. నేనుపోయి గేదెను పిలిస్తే యేముంది? నాలెడు నీళ్ళుకూడా లేవు, ఒడిలిలోట్లో. దీన్ని యేంబుద్ధి?" అన్నది కొంతమ్మ.

"... "నిజమే పిల్లా. మీ అత్త దొంగబుద్ధి ... ఎన్నినాళ్ళనుంచి ... ఇవాళ కొత్తా?" అని రహస్యంగా అన్నది.

అరుగో తని పెట్టి లోగిలిమంచి కనుక్కొంటున్న సుబ్బమ్మ వొచ్చింది "ఏమిటీ కొంతమ్మ అత్తని తిడుతూన్నట్టుందే" అంటూ.

కొంతమ్మ యథార్థం చెప్పింది, సుబ్బమ్మతో. విని అన్నది "అంతా ఆ కూతురికే. యిత రాళ్ళ నడిచినా కూడా తన గేదెకే పెట్టుకొని సంపాదించి దోచిపెట్టక పోతే, కొడుకువంక చూడకూడదమా?" అని.

"నిజమే. కొంతమ్మ! దానికా దొంగబుద్ధి దేనికి? ఇవాళ కుడిచి యింది. రేపు యింకో టవుతుంది. ఇంతకీ కొంతమ్మ సుగుణవంతురాలు కావటంతో వచ్చింది. ఈ మా త్రానికే చంద్రమ్మగారు కోడలైతే అత్తని రాచిరంపాన పెట్టేది. ఇంతకీ..." అని సుబ్బమ్మ కొంతమ్మని పురికొల్పింది.

కొంతమ్మ ప్రళయరూపం దాల్చింది.నోటిని వొదిలింది. నలుగురూ పోగయ్యారు.

"మనిషికి నీతివుండాలికొని అది లేక పోతే కోతికంటే హీనమే. యాభైయేళ్లు వొచ్చినయ్య కదా దానికిదేం బుద్ధి? నేనుపోసిన ముష్టికుడితిని నేను యింటిదగ్గర్నుంచి దొడ్లోకి వొచ్చేలోపల తన గేదెకు ఎందుకు పెట్టుకో వాలి? ఎంత సంపాదించి అవతల వాళ్ళకి దోచి పెట్టాలని? ఇటువంటి దొంగ కూడు తింటేం తినకపోతేనేం? ఇంకా పెద్దపెద్దనీతులు చెపుతుంది. తన ఆస్తికోసం మేమంతా వాచిపో తున్నట్టు వాగుతుంది." ఈ ధోరణిలో ఆరంభించి కొంతమ్మ రానురాను. "దాని కడుపు కాలా. దాని గేదెను మహామారి తెల్లవారే లోపు మింగా ..." ఇటువంటి నానావిధ ధోరణిలో పడింది.

కృష్ణవేణమ్మ కిక్కురుమనలేదు. ఇవన్నీ ఓపికతో విన్నది. ఇక భరించలేక పోయింది. పడకకి ముసుగుతన్ని పట్టిన భర్తని లేపింది. జానకిరామయ్య కథసంతా వింటూనే వున్నాడు.

"ఆ దిక్కుమాలిన ముండ అట్లా తిట్టి పోస్తూంటే మీరు ముసుగుతన్ని పడుకొన్నారేం. ఇంకొంచంసేపుంటే పిడిపాలు చేస్తుంది" అన్నది కృష్ణవేణమ్మ కోపమునిండా పొరలుతూన్న కనులు అప్పగొంటూ.

"అయితే యేం చేయమంటావు? అసలు వాళ్ళ కుడితిని గేదెకు పెట్టాల్సిన ఖర్మమేం కొలిందని?" అన్నాడు జానకిరామయ్య ముసుగు తొలగించి.

"ఏదో బుద్ధి గడ్డితిన్నదిగా. అది నిన్న మన గేదెదగ్గర జనపకట్టెలు తన గేదెకు వేసుకొందిగా? అందుచాత అట్లాచేశాను. పాడు ముండకు హద్దా? అహా. చూడు ఎట్లా తిట్టి పోస్తూందో! కొంత కోరణం దొరికితే చాలు. త్వరగా లేచి వాడితో చెప్పి ఆ గోల మాన్పించండీ?" అని విసుక్కుంది మొగుడిమీద కృష్ణవేణమ్మ.

జానకిరామయ్య లేచి ప్రక్క భాగంలో వుంటూన్న కొడుకుదగ్గరకు వెళ్ళాడు. కొడుకు శివయ్య యింకా మంచంమీదనుంచి లేవనే లేదు. ఆయనకి భార్య గొందిలో చేస్తూన్న గోల కూడా వినిపించలేదు.

"ఒరేయ్! శివయ్యా! శివయ్యా!" నాలుగు కేకలు వేసింతరువాత లేచాడు, శివయ్య-త్తర పాటుగా.

"ఏం నాన్నా! పొద్దున్నే వచ్చావ్" అన్నాడు శివయ్య. తండ్రంటే శివయ్యకు తనకు న్యాయంగా భాగం పంచిపెట్టక పోయినప్పటికీ అభిమానమే.

"ఏముందిరా? అల్లా చూడు గొందిలో. నీ భార్య చేస్తూన్న గోల. నీ అమ్మ పొద్దున్న నీ భార్యపోసిన కుడితి తన గేదెకు పెట్టుకున్నదట. ఆ కొంత కోరణానికి చూడు అది తిట్టే తిట్లు తిట్లు కావుగా? చూడు ఎంతమంది జనం పోగయ్యారో. ఇంకా మన పరువు ఎక్కడుందిరా త్వరగాపోయి నీ భార్య నోరు మూయించరా!" అన్నాడు జానకిరామయ్య. పాపం పెద్దవాడు, ఆడవాళ్ళతగువు మూలాన చెడ్డపేరు రావడం సహించలేనివాడు.

శివయ్య త్వరగా లేచి భార్యదగ్గరకు వెళ్లాడు. కాని నిజంగా భార్యక్రింద శివయ్య యేపాటి వాడు? ఎన్నడైనా భార్యకు ఎదురు చెప్పాడా? అయినా శివయ్య మగవాడు కనుక, భార్య సిగ్గు విడచి గొంతులో తల్లిని శాపనార్థాలు పెడుతూంటే, కనీసం కంట్రీని చూస్తైనా అతని హృదయం తల్లడిల్లింది.

“అబ్బా! ఊరుకోవే నీగోల. ముష్టి కుడితి ఎవరిగేదె త్రాగితేనేం? దీనికి యింత రభస చేయాలా? పైగా నలుగురూ నవ్వేట్టు” అన్నాడు శివయ్య భార్యకేసి.

“అయిన వాళ్ళని మీకే మమకారం వుండబట్టే మీ తల్లి ముందే అట్లా కుడితినీళ్ల దగ్గర్నుంచి దొంగతనం చేస్తూ కూతురుకు దోచిపెడుతూన్నది. ఏం మన మెంగు కూడుకోవాలి? అసలు ఆ నాపని యెందుకు చేయాలంట” కాంతమ్మ తోకతొక్కిన త్రాచులాగ లేచింది.

“ఏదో చేసిందిలే. పెద్దదైంది. ఇటువంటివి మనం పట్టించుకోకూడదు. చూసీ చూడనట్టు తొలగిపోవాలి” అన్నాడు శివయ్య.

“ఊం. మనం అంత తక్కువైన వాళ్ళమా? ఇవాళ చూసీ చూడనట్టు పోనిస్తే రేపు మనల్ని యీ వీథిలో కూడా వుండనివ్వదు” అన్నది కృష్ణవేణమ్మ.

ఎట్లాగైతేనేం భార్యనోరు మూయించేసరికి శివయ్యకు తలప్రాణం కాలిలోకి వొచ్చింది. అప్పటికీ కాంతమ్మ యింటికి వొచ్చి అత్తని సాధిస్తూనే వున్నది.

అత్తాకోడళ్ల తగువులు ఒకవిధంగా వంశానికి కొంత అప్రతిష్ఠని ప్రసాదిస్తున్న విషయం అందరకూ తెలిసిందే. ముఖ్యంగా జానకిరామయ్య ఈ పోట్లాటలను తన భార్య కోడళ్లు మధ్య తొలగించాలని కృషిచేసిన మాట వాస్తవమే కాని ఫలితం శూన్యం.

మరునాడు సాయంత్రం కాంతమ్మ చావట్లోకి వెళ్ళింది. నిన్నటినుంచీ ఆమె మనస్సు కృష్ణవేణమ్మకు యేదో ప్రతీకారం చేయాలని ఉబలాటపడుతూనే ఉన్నది. దొడ్లోకి పోవటంతోనే నెలరోజుల క్రిందట యీనిన పాడి గేదె కనిపించింది, కాంతమ్మకు. పక్కనే పది గజాల దూరంలో దూడ కట్టివేసివుంది. అది కృష్ణవేణమ్మది. ఈ మధ్యనే కృష్ణవేణమ్మ గేదె ఎక్కువ పాలు యిస్తూన్నట్లు, అందువల్లగా ఆమె యెక్కువ పెరుగు అమ్మి డబ్బు చేస్తూన్నట్టు కాంతమ్మకు తెలిసినప్పట్నుంచీ ఆమె మనస్సు అసూయతో నిండివుంది. అందులో నిన్న ఆ గేదె కాంతమ్మ పోసిన కుడితి త్రాగింది.

కాంతమ్మ యేం తోచక ఎట్లా కృష్ణవేణమ్మ నష్టం కలుగజేసి తన కసిని తీర్చుకుందామా అని ఆలోచిస్తూ దొడ్డంతా రెండు మూడుసార్లు కలియ తిరిగింది. సూర్యుడూ అస్తమిస్తున్నాడు. పడమటి భాగం అంతా యెరుపుగా ఉంది. ఇంకా కొంచెంసేపు ఉంటే కృష్ణవేణమ్మ చావట్లోకి వొస్తుంది గేదెపాలు పితికేందుకు. ఈ లోపలే చేయాలి, ఏం చేసినా అనుకుంది కాంతమ్మ.

వెంటనే మనస్సులో ఒక ఆలోచన తట్టింది. గేదెదూడను విప్పితే పాలన్నీ త్రాగుతుంది. చేపుకూడా పోతుంది. గేదె పాలివ్వదు ఇక ఆ రాత్రికి. అటూ ఇటూ చూసి కాంతమ్మ కృష్ణవేణమ్మ గేదె దూడనువిప్పి గేదెదగ్గరకు తోలింది. ఆ దూడ రయ్యమని గంతులు వేసుకొంటూ వొచ్చి, పాలు త్రాగుతూన్నది. కాంతమ్మ చావట్లోనుండి బయలుదేరింది. గొందిలో నాంచారమ్మా, సూర్యకాంతమ్మా కూచొని కబుర్లు చెప్పుకుంటూంటే అక్కడ కొచ్చి కబుర్లలో పాల్గొన్నది కాంతమ్మ. కాంతమ్మ మనస్సులో భీతిగానే వుంది, తను చేసినపనిని ఎవరన్నా చూశారేమోనని.

పదినిమిషాలు గడిచాయి.

కృష్ణవేణమ్మ పాలతపాళా తీసికొని చావట్లోకి వెళుతూండగా, కృష్ణవేణమ్మని చూసి కాంతమ్మ మూతి బిగించుకొని మెల్లగా యింటికి బయల్దేరింది. కృష్ణవేణమ్మ చావట్లోకి వెళ్లి చూసేటప్పటికి దూడ కడుపునిండా పాలు త్రాగి గేదెచుట్టూ ప్రదక్షిణాలు చేస్తూవుంది. కృష్ణవేణమ్మకు నిజంగా ఆశ్చర్యం వేసింది. ప్రొద్దున్న పాలుతీసిన పిదప కొత్త తాడుతో దూడను ఆమే గట్టిగా కట్టివేసింది. ఆటువంటప్పుడు పసిదూడ, నెలరోజుల దూడ త్రెంచుకోవటం కాని, వూడదీసుకోవటం కాని అసంభవం. గేదె చేపు కూడా లేదు.

ఈ దొంగపని కాంతమ్మే చేసి వుంటుందని వెంటనే తట్టింది. కృష్ణవేణమ్మకు వొళ్లు కారం పూసుకున్నట్టు మండిపోతున్నది, కాంతమ్మ మీద. అందులో ఆమెనిన్న తిట్టినతిట్లకు సమయం దొరకనే దొరికింది. తను ఎందుకు చేతులు ముడుచుకొని, నోరు మెదపకుండా వుండాలి?

"ఏదీ. ఆ కాంతమ్మ ముండ యిక్కణ్ణుంచి వెళ్ళిందే. కోడలు!... కోడలు... చట్టుబండలు గాని. ఏమి బుద్ధే దానిది? కొక్కిరబుద్ధి... నిన్న నన్ను అనవసరంగా అన్ని తిట్లుతిట్టింది. ఇవాళ కనపడనీ దాని పని చెపుతాను." అని ఆరంభించి గట్టుమీద కూచున్నది.

నాంచారమ్మ నవ్వుతూ "కృష్ణవేణమ్మత్తా, యేం చేసిందేమిటి నీకోడలూ! దానిబుద్ధే వక్రబుద్ధి. నీలాంటి ఉత్తమురాల్లకు దొరకవలసిన కోడలుకాదు. ఇంతకీ..." అన్నది.

కృష్ణవేణమ్మకు అరికాలిమంట నెత్తికెక్కింది. "మొన్న నేమన్నా జ్ఞాపకముంటేను దొంగతనంగా కాజేసి తన గేదెను మేపుకొంది. ఇవాళేమన్నా... నా గేదె దూడనివిప్పి పాలన్నిటినీ కుడిపించింది. ఏంపని చెప్పు. మొత్తని దాన్ని కదూ, అఘరణ్ణాంచేసి వొత్తుగా మనుకొంది గనుక. అనన్నీ చెల్లవు. ఏం పాపం చేసుకొన్నానో ఇటువంటి దొంగకోడలు దొరికింది. అప్రదిష్ట తేవటానికి" ఈ ధోరణిలో ఇష్టమొచ్చినట్టు వాగటం ఆరంభించింది కృష్ణవేణమ్మ.

ఈ మాటలన్నీ కాంతమ్మ విన్నది. గంయ్ మని లేచింది, కృష్ణవేణమ్మమీదకు.

"ఎవరన్నె అ కేది భడవా... నీదూడను నేను విప్పానా? ఏ చెడిపోయినవాడు చూశాడు? నువ్వు చూశావా? నీ మొగుడు చూశాడా? ఇటువంటి కాని మాటలు మాట్లాడావంటే మర్యాద దక్కదు. జాగ్రత్త! ఇంకా పైగా యేమేమో వాగుతున్నావు. నీ జ్ఞాపకమ్లైలు తీశానా? చూసి పట్టుకోలేకపోయావా?..." కాంతమ్మ చేతులు త్రిప్పుతూ బిగ్గరగా అనసాగింది.

ఇద్దరి పోట్లాట విపరీతంగా వుంది. శివయ్య లేడు. జానకిరామయ్య లేడు. బజారులోని జనమంతా పోగయ్యారు. పోట్లాట యిద్దరూ జుట్లు లంకించుకొనేంత వరకూ పెరిగిపోయింది.

ఈ సమయంలో జానకిరామయ్య బజారు నించి వచ్చాడు. గొందిలో జరుగుతూన్న తిరునాళ్ళని చూశాడు. ముఖ్యంగా ఆ జనాన్ని చూసి జానకిరామయ్యకు తలవంపు వేసింది. భార్య, కోడలు పోట్లాట తెగేట్టు కాదు. కొంచెంసేపు వుంటే మరో ఘోర రూపం దాల్చేట్టు వుంది. జానకిరామయ్య పోట్లాట మూలకారణం తెలుసుకున్నాడు.

ఇద్దరి మధ్యకూ వెళ్ళి, జానకిరామయ్య తగవును ఆపేందుకు భార్యకేసి గట్టిగా అన్నాడు.

"జేనకీ, కాంతమ్మతో అట్లా పోట్లాడతావు. ఇంటికిపో" అన్నాడు.

"మీకు తెలీదు వూరుకోండి. నిన్న కుడితినీళ్ళు పెట్టుకొన్నామని అన్నితిట్లుతిట్టి బజార్లో పెట్టింది. ఇవాళ అది చేసినపని బాగున్నదా? అసూయతో మన గేదెదూడను విప్పి పాలు కుడిపించి. అదేమని అడిగినందుకు పైగా నోరు పారేసుకుంటున్నది" అన్నది కృష్ణవేణమ్మ.

"నేనేమీ నోరు పారేసుకోవటంలేదు. నేనేమీ దూడను విప్పలేదు. అటువంటప్పుడు నా పేరెత్తి నన్ను తిట్టటం దేనికి? నేను లోకువగా వున్నాననా? ఎవరిది దొంగ బుద్ధయిందీ యిక్కడున్న వాళ్ళందరికీ తెలుసు. ఊరికే నే నోరు పారేసుకొని లాభంలేదు" అన్నది కాంతమ్మ.

"సరే. ఊరుకోండమ్మా. దూడను విప్పింది యెవరూ కారు. నేనే. దూడ మరీ బక్కచిక్కివుంటేను ఒకపూట పాలైనా త్రాగి బలుస్తుందని విప్పాను. దీనికోసం యింత రసాభాస చేసుకోవటం దేనికి?" అన్నాడు జానకిరామయ్య.

కృష్ణవేణమ్మ, కాంతమ్మ ఒకే విధంగా అమితమైన ఆశ్చర్యానికి గురయ్యారు.

అయినా కాంతమ్మ అంతటితో విడిచిపెట్టదలుచుకోలేదు. "నిజం నిలకడమీద నే తెలుస్తుంది. ఈ భాగ్యానికి దూడని యెవరువిప్పారో తెలుసుకోక నన్ను తిట్టి యేం లాభం? తిట్టినవాళ్ళకే తిట్లు తగులుతయ్" అన్నది తన కసిదీర.

కృష్ణవేణమ్మకి నోరు యెత్తడానికి వీలు కనపడలేదు. అవమానంతో క్రుంగిపోయింది. ఇంటికి రాగానే జానకిరామయ్యను అడిగింది:

"నిజంగా మీరే దూడను విప్పారా?" అని.